నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, శనివారం 8 జూన్ 2024 | BHADRADRI KOTHAGUDEM

మార్కెట్‌లో క్రయవిక్రయాలు షురూ..

మిర్చి క్వింటా ధర రూ.16,200

ఖమ్మం వ్యవసాయం, జూన్ 7 : వరుస సెలవుల అనంతరం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం నుంచి క్రయవిక్రయాలు ప్రారంభమయ్యాయి. గత నెల 10వ తేదీ నుంచి పార్లమెంట్‌ఎన్నికలు, తర్వాత వేసవి సెలవులు రావడంతో మార్కెట్‌లో క్రయవిక్రయాలు చేపట్టలేదు. శుక్రవారం ఉదయం నుంచి క్రయవిక్రయాలు చేపట్టడంతో జెండా పాటలో మిర్చి క్వింటా ధర రూ.16,200 పలుకగా.. కనిష్ట ధర రూ.10 వేలు పలికింది. ఏసీ రకం క్వింటా గరిష్ట ధర రూ.20 వేలు పలుకగా.. కనిష్ట ధర రూ.10 వేల చొప్పున ఖరీదుదారులు కొనుగోలు చేశారు. ఇక పత్తి పంట ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో క్వింటా ధర రూ.7,050 పలికింది. పెసర పంట క్వింటా ధర రూ.7 వేలు పలికింది. అయితే తొలిరోజు అపరాలు, పత్తి, మిర్చి పంటను ఆశించిన మేర రైతులు మార్కెట్‌కు తీసుకురాలేదు. శని, ఆదివారం మార్కెట్‌కు సెలవులు కావడంతో సోమవారం నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు చేపట్టనున్నారు. తొలిరోజు క్రయవిక్రయాలను మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షించారు.

ఉత్కంఠ పోరులో కాంగ్రెస్ గెలుపు

- పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న
- రాకేశ్‌రెడ్డి ఎలిమినేషన్‌తో మల్లన్న విజయం
- చివరి వరకు బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గట్టిపోటీ
- సుదీర్ఘంగా సాగిన కౌంటింగ్ ప్రక్రియ

నల్లగొండ ప్రతినిధి, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. మూడ్రోజులపాటు ఉత్కంఠగా సాగిన ఓట్ల లెక్కింపులో ఎలిమినేషన్ రౌండ్స్‌తో ఆయన విజయం ఖరారైంది. ఆది నుంచి హోరాహోరీగా సాగిన పోరులో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలో రెండో స్థానంలో ఉన్న రాకేశ్‌రెడ్డి ఎలిమినేషన్‌తో మల్లన్నను విజయం వరించింది. పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికల పోరు మొదటి నుంచి చివరి వరకూ ఆసక్తికరంగా సాగింది. బుధవారం ఉదయం 8 గంటల నుంచి మొదలైన కౌంటింగ్ ప్రక్రియ ఉత్కంఠతను రేకెత్తించింది. ప్రధాన అభ్యర్థులుగా కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి రాకేశ్‌రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్‌రెడ్డితోపాటు స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 52 మంది ఉప ఎన్నిక బరిలో నిలిచారు. గత నెల 27న పోలింగ్ జరిగింది. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 4.63 లక్షల ఓట్లు ఉండగా, 3,36,013 ఓట్లు పోలయ్యాయి. నల్లగొండ శివారులోని దుప్పలపల్లి వేర్ హౌసింగ్ గోదాములో మూడ్రోజుల పాటు కౌంటింగ్ సాగింది. బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొదలుపెట్టగా గురువారం రాత్రి 10 గంటలకు పూర్తయ్యింది. దాంతో అప్పుడు చెల్లని 27,978 ఓట్లను పక్కన వేసి చెల్లిన ఓట్ల నుంచి గెలుపు కోటాను నిర్ధారించారు. మొత్తం 1,55,095 ఓట్లు సాధించిన అభ్యర్థి గెలుపొందుతారని ప్రకటించారు. గురువారం రాత్రి 10 గంటల నుంచి ఎలిమినేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో అతి తక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థి మొదటగా ఎలిమినేషన్ చేశారు. ఆయనకు వచ్చిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను పైనుంచి మిగిలిన అభ్యర్థులకు పంచుతూ వచ్చారు. ఇలా మొత్తం స్వతంత్ర అభ్యర్థులుగా ఉండి అత్యధిక ఓట్లు సాధించిన అశోక్‌కుమార్ వరకు సాగింది. ఇక్కడ కూడా గెలుపు కోటాకు అవసరమైన ఓట్లు ఎవరికీ రాలేదు. తొలి ప్రాధాన్యత ఓట్లలో 18,865 ఓట్ల ఆధిక్యం సాధించిన తీన్మార్ మల్లన్న ఎలిమినేషన్ రౌండ్స్‌లోనూ ఆధిక్యతను కొనసాగించారు. ఆర్‌వో హాల్‌లో చివరి నుంచి పైకి 48 మంది అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియను చేపడుతూ వచ్చారు. కౌంటింగ్ మరింత ఆలస్యం అవుతున్న కారణంగా శుక్రవారం ఆర్ఓ హరిచందన అభ్యర్థులతో చర్చించి ఏకాభిప్రాయంతో తొలి ప్రాధాన్యతలో ఎక్కువ ఓట్లు ఉన్న స్వతంత్ర అశోక్‌కుమార్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ రౌండ్స్‌ను నాలుగు కౌంటింగ్ హాల్స్‌లో సమాంతరంగా మొదలుపెట్టారు. 49వ అభ్యర్థిగా ఎలిమినేషన్‌కు గురైన అశోక్‌కుమార్ నుంచి అనధికార లెక్కల ప్రకారం... తీన్మార్ మల్లన్నకు సుమారు 9 వేల ఓట్లు రాగా, రాకేశ్‌రెడ్డికి 8,700 ఓట్ల వరకు వచ్చాయి. తర్వాత ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ రౌండ్‌ను చేపట్టారు. ఇందులో రాకేశ్‌రెడ్డి ఆధిపత్యం ప్రదర్శించారు. అనధికార లెక్కల ప్రకారం రాకేశ్‌రెడ్డికి 18 వేల పైచిలుకు ఓట్లు రాగా, మల్లన్నకు 13 వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి. వాటితోపాటు దిగువన ఎలిమినేట్ అయిన అభ్యర్థుల నుంచి సబ్ పార్సిల్స్‌లో వచ్చిన ఓట్లను సైతం మల్లన్నకు, రాకేశ్‌రెడ్డికి షేర్ చేశారు. ఈ క్రమంలో మల్లన్న గెలుపు కోటా సుమారు ఐదు వేల ఓట్ల దూరంగా నిలిచిపోగా.. రాకేశ్‌రెడ్డి 20 వేల దూరంలో ఉన్నారు. దాంతో రాకేశ్‌రెడ్డిని కూడా ఎలిమినేట్ చేయడంతో మల్లన్న విజయం ఖాయమైంది. తీన్మార్ మల్లన్న విజయం ఖాయం కావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పటాకులు కాలుస్తూ సంబురాలు చేశారు. ఇది సమష్టి విజయమని తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించారు.

చెల్లని ఓట్లు గణనీయంగా....

పట్టభద్రుల ఎన్నికల్లోనూ ప్రతీసారి చెల్లని ఓట్లు భారీగా ఉంటుండడం చర్చనీయాంశంగా మారింది. అభ్యర్థుల ప్రచారంలో, సోషల్ మీడియాలో, అధికారికంగానూ ఎంత అవగాహన కల్పిస్తున్నా పట్టభద్రులు ఓటు వేయడంలో తడబాటుకు గురవుతూనే ఉన్నారు. ఈ సారి కూడా 27,978 ఓట్లు చెల్లకుండా పోయాయి. మొత్తం ఓట్లలో ఇవి 8.32 శాతంగా ఉన్నాయి. ఇక 2021 మార్చి ఎన్నికల్లో 5.57 శాతంతో 21,636 ఓట్లు చెల్లకుండా పోయాయి. 2015 మార్చిలో జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే 9.14 శాతం ఓట్లతో 14,039 ఓట్లు చెల్లలేదు. పోస్టల్ బ్యాలెట్ల లోనూ సరైన నిబంధనలు పాటించని కారణంగా పలువురి ఓట్లు చెల్లలేదని తెలిసింది.

సుదీర్ఘంగా కౌంటింగ్

కౌంటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా సాగింది. ఎలిమినేషన్ రౌండ్స్ కూడా 26 గంటలకు పైగా కొనసాగాయి. గురువారం రాత్రి 9 గంటల తర్వాత బరిలో ఉన్న అభ్యర్థులందరికీ ముందుగా దీనిపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత గెలుపు కోటా సాధన కోసం ఎలిమినేషన్ రౌండ్స్‌ను ప్రారంభించారు. ఆర్ఓ హరిచందన పర్యవేక్షణలో ఎలిమినేషన్ రౌండ్స్‌లో బరిలో ఉన్న మొత్తం 52 మందిలో తక్కువ ఓట్లు కలిగి ఉన్న వారిని ఒక్కొక్కరిని తొలగించుకుంటూ వారికి వచ్చిన ద్వితీయ తర్వాత ప్రాధాన్యత ఓట్లను మిగిలిన అభ్యర్థులకు పంచుతూ కొనసాగించారు. శుక్రవారం ఉదయం 12 గంటల వరకు 33 మందే ఎలిమినేట్ కావడంతో సుదీర్ఘ సమయం పడుతుందని ఆలోచించారు. దాంతో ఆర్ఓ హాల్‌లో అశోక్‌కుమార్‌కు దిగువన ఉన్న స్వతంత్ర అభ్యర్థుల ఎలిమినేషన్ రౌండ్స్‌ను కొనసాగిస్తూనే సమాంతరంగా అశోక్‌కుమార్ ఎలిమినేషన్ నాలుగు కౌంటింగ్ హాల్స్‌లో చేపట్టారు. ఆ తర్వాత వెంటనే ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ రౌండ్ చేశారు. వీరిద్దరితోపాటు అంతకుముందున్న వారి ఎలిమినేషన్ పూర్తయ్యే సరికి రాత్రి 10 గంటలు దాటింది. వీరి ఎలిమినేషన్ అనంతరం అధికారికంగా లెక్కలు తేలేసరికి మరింత సమయం తీసుకుంది. అర్ధరాత్రి రాకేశ్‌రెడ్డి ఎలిమినేషన్‌తో మల్లన్న విజయం ఖరారైంది. దాదాపు 64 గంటలకు పైగా కౌంటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఈ కౌంటింగ్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు ఇలా ప్రతి ఒక్కరూ పూర్తి అలసటగా కనిపించారు.

పకడ్బందీగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, జూన్ 7 : టీజీపీఎస్సీ ఆదేశాల మేరకు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఈ నెల 9న పకడ్బందీగా నిర్వహించాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్స్, డిపార్ట్‌మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లకు పరీక్ష నిర్వహణపై చేపట్టిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీజీపీఎస్సీ నిబంధనల ప్రకారం మొదటిసారిగా బయోమెట్రిక్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 52 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 18,403 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఒకరోజు ముందుగానే తమ పరీక్షా కేంద్రాన్ని తెలుసుకోవాలని, హాల్ టికెట్లు టీజీపీఎస్సీ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకోవాలని, ప్రతి కేంద్రంలో ఉదయం 10 గంటలకే గేట్లు మూసివేయాలని అధికారులను ఆదేశించారు. మహిళా అభ్యర్థులను తనిఖీ చేయడానికి ప్రత్యేకంగా మహిళా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి అభ్యర్థి హాల్ టికెట్‌తోపాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆధార్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటివి వెంట తెచ్చుకోవాలని సూచించారు. హాల్ టికెట్‌పై అభ్యర్థి ఫొటో సరిగా లేకపోతే గెజిటెడ్ అధికారిచే అటెస్టెడ్ చేయించుకొని సొంత డిక్లరేషన్ రాసి ఇవ్వాలని, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్, డిపార్ట్‌మెంట్ అధికారులకు కూడా పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. అభ్యర్థులు షూస్, జ్యూవెల్లరీ వేసుకొని రావొద్దని, ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్స్, సెల్ ఫోన్లు, రికార్డింగ్ వస్తువులు, కాలిక్యులేటర్, వాచ్, రైటింగ్ ప్యాడ్‌లకు అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్లు, విజయ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జాన్‌బాబు, ఎస్‌బీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజ్‌కుమార్, జిల్లా అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, డిపార్ట్‌మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి : భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : టీజీపీఎస్సీ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఈ నెల 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిసారిగా బయోమెట్రిక్ పద్ధతిన పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మొత్తం 8,875 మంది పరీక్షకు హాజరు కానున్నారని, ఇందుకోసం 21 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఉదయం 10 గంటలకే గేట్లు మూసివేస్తారని, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రంలోకి అనుమతించేది లేదని, నిమిషం నిబంధన కచ్చితంగా అమలులో ఉంటుందని, అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు కట్టుదిట్టమైన భద్రత

భద్రాద్రి ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, జూన్ 7 : గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిందని భద్రాద్రి ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9న జిల్లాలోని 21 కేంద్రాల్లో 8,871 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరూ ఆయా కేంద్రాల పరిసరాల్లో అనవసరంగా తిరగొద్దని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు తెరిచి ఉంచొద్దని, బయోమెట్రిక్ విధానం ద్వారా అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద తనిఖీ సిబ్బంది అభ్యర్థులు సహకరించాలని, ప్రతి ఒక్కరూ టీజీపీఎస్సీ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు.

పిల్లలను బడిబాట పట్టించాలి : అదనపు కలెక్టర్

ఉపాధ్యాయులకు ఏకరూప దుస్తులు అందిస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

టేకులపల్లి, జూన్ 7 : బడి బయట ఉన్న పిల్లలను బడిబాట పట్టించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని, ఇంటింటికి తిరుగుతూ దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని డీఆర్‌డీవో, అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విద్యాచందన, డీఈవో వెంకటేశ్వరాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడీడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి ప్రతి పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే రెండు జతల దుస్తులను ఈ నెల 8వ తేదీ వరకు పాఠశాలలకు చేరవేయాలని ఏపీఎం రవికుమార్, మహిళా సమఖ్య సభ్యులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి సైదులు, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీవో రవీందర్‌రావు, ఏపీఎం రవికుమార్, మండల నోడల్ అధికారి జగన్, ఐకేపీ సీసీలు, వీవోఏలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ : డీఏవో

విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఏవో విజయనిర్మల

కొణిజర్ల, జూన్ 7 : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించినట్లైతే వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) విజయనిర్మల హెచ్చరించారు. శుక్రవారం తనిఖెళ్లోని విత్తన దుకాణాలను వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఎంఏవో బాలాజీతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్స్, ఇన్వాయిస్, జీవోటీ కాపీలు కలిగి ఉండాలని, రైతులకు విక్రయించే విత్తన ప్యాకెట్ వివరాలు నమోదు చేస్తూ రిజిస్టర్ నిర్వహించాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి రశీదులు విధిగా ఇవ్వాలని, పంట చివరి కాలం వరకు వాటిని భద్రపరుచుకోవాలని సూచించారు. గరిష్ఠ ధరలకు లోబడి మాత్రమే విత్తనాలను విక్రయించాలని, లూజ్ ప్యాకెట్లు, గుడ్డ సంచుల్లో విక్రయించే విత్తనాలకు అనుమతి లేదన్నారు. డీలర్లు విధిగా దుకాణాల ఎదుట స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని, అందులో స్టాక్ వివరాలను తెలుగులో పొందుపర్చాలని సూచించారు. రైతులు ఒకే కంపెనీకి చెందిన విత్తనాలు కొనుగోలు చేసి డిమాండ్ పెంచొద్దని, కంపెనీ విత్తనాలు ఏవైనా మంచి దిగుబడి వస్తుందన్నారు. నకిలీ విత్తనాల విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.

రైళ్లో గంజాయి పట్టివేత..

స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మామిళ్లగూడెం, జూన్ 7: కోణార్క్ రైళ్లో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ స్టేషన్-1 సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి రవాణాపై నిఘా పెరగడంతో అక్రమార్కులు గంజాయిని రైళ్లలో తరలిస్తున్నారని తెలిపారు. రైళ్లలో గంజాయి తరలిస్తున్నారన్న విషయాన్ని పసిగట్టి రైళ్లలో తనిఖీలు మరింత పెంచామని తెలిపారు. ఈ నేపథ్యంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా 23 కిలోల ఎండు గంజాయి గుర్తించామని తెలిపారు. ఒరిస్సా నుంచి అక్రమంగా గంజాయిని కోణార్క్‌లో తరలిస్తుండగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేష్‌తో పాటు హరీష్, వెంకట్, హన్మంతరావు, సుధీర్, విజయ్, బేబీ తనిఖీలు నిర్వహించారు. గంజాయిని తూకం వేయగా 23 కేజీలుగా ఉన్నదని, దీని విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. గంజాయిని పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఏఈఎస్ తిరుపతి అభినందించారు.

నగరంలో గంజాయి విక్రేత అరెస్టు

ఖమ్మం నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ స్టేషన్-2 అధికారులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ స్టేషన్-2 సీఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని శ్రీనివాసనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న చేకూరి శ్రీను మహబూబాబాద్ పట్టణం నుంచి గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా కొనుగోలు చేసిన 100 గ్రాముల గంజాయిని విక్రయించేందుకు యత్నిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి ఒక ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

‘యూనిఫాం’, ‘మధ్యాహ్న భోజనం’పై సందేహాలు
‘రెండు జతల యూనిఫాం’ అసాధ్యమయ్యే అవకాశం
ఎస్‌హెచ్‌జీ సభ్యుల వద్ద స్టిచ్చింగ్ ప్రక్రియ ఆలస్యం?
కొన్ని రోజులు ఒక్క జతతోనే సర్దుకోవాల్సిన పరిస్థితి?
విద్యార్థుల ‘మధ్యాహ్న భోజనం’పైనా అయోమయం
ఎండీఎం బాధ్యులకు ఇప్పటికే రూ.3 కోట్ల బకాయిలు
పారితోషికం రాకున్నా అప్పులతో నెట్టుకొస్తున్న సంఘాలు
‘ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ’ సరేసరి!

విద్యార్థుల యూనిఫాంలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల(ఫైల్)

ఆ రెండింటిపైనే ఆందోళన

పాఠశాలకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉంచిన పాఠ్యపుస్తకాలు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : మరో ఐదు రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఓ రెండు అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సర్కారు బడుల్లో ప్రవేశాలను పెంచేందుకు ఇప్పటికే ‘బడిబాట’ కార్యక్రమాన్ని ప్రభుత్వ పెద్దలు మొదలుపట్టారు. 19 వరకూ దానిని కొసాగించనున్నారు. ఇందులో పాఠ్యపుస్తకాలు మినహా రెండు ప్రధానమైన అంశాలు విద్యార్థుల తల్లిదండ్రుల్లో అయోమయాన్ని పెంచుతున్నాయి. అందులో ఒకటి రెండు జతల యూనిఫాం కాగా.. మరోటి మధ్యాహ్న భోజనం. ఒకవైపు అట్టహాసంగా బడిబాట కార్యక్రమం చేపట్టడం, మరోవైపు త్వరలోనే పాఠశాలలు పునఃప్రారంభించడం వంటివి జరుగుతున్నప్పటికీ ఆ సమయంలోగా రెండు జతల యూనిఫాం అందడం కష్టంగా కన్పిస్తోంది. ఇంకోవైపు మునుపటి మధ్యాహ్న భోజన బకాయిలే ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. అవి చెల్లించకుండా విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి ఆటంకం కలగకుండా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే అంశం ప్రశ్నార్థకంగా ఉంది.

స్టిచ్చింగ్ ఆలస్యం?

12న జిల్లాలో పాఠశాలలు ప్రారంభమైనా విద్యార్థులకు యూనిఫాం మాత్రం ఆలస్యమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ యూనిఫాం మాత్రం నిర్ణీత సమయానికి అందే పరిస్థితి కన్పించడం లేదు. విద్యార్థుల యూనిఫాం స్టిచ్చింగ్ బాధ్యతను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించిన ప్రభుత్వం.. అందుకు సంబంధించిన వస్త్రాన్ని ఆలస్యంగా అందజేసింది. దీంతో వారి స్టిచ్చింగ్ ప్రక్రియ కూడా ఆలస్యమవుతోంది. ఆ ప్రభావం విద్యార్థులపై పడే ప్రమాదముంది. దీంతో విద్యార్థులకు తొలుత ఒక్కో జత మాత్రమే ఇచ్చి, తర్వాత మరో జత అందించే అవకాశాలు ఉన్నాయి. ఫలితంగా విద్యార్థులు కొన్ని రోజులపాటు ఒక్క జతతోనే సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. భద్రాద్రి జిల్లాలో 63,399 మంది విద్యార్థులున్నారు. ఇంతకొద్ది సమయంలో ఇంతమందికి యూనిఫాం అందించడం కష్టసాధ్యంగా కన్పిస్తోంది.

పాఠ్యపుస్తకాల విషయం ఉపశమనం

పాఠశాలలు తెరవక ముందే పాఠ్య, టెస్టు పుస్తకాలు సిద్ధంగా ఉండాలన్న విషయం మాత్రం విద్యార్థులకు కొద్దిగా ఉపశమనంగా అనిపిస్తోంది. ఇప్పటికే 5,06,080 పుస్తకాలు ఆయా పాఠశాలలకు చేరాయి. ఇంకా 10,920 పుస్తకాలు రావాల్సి ఉంది. 2వ తరగతి తెలుగు, 8వ తరగతి ఆంగ్లం పుస్తకాలు ఇంకా రాలేదని అధికారులు చెబుతున్నారు. 2,66,458 టెస్టు పుస్తకాలు కూడా గోదాముల నుంచి పాఠశాలలకు చేరాయి.

‘మధ్యాహ్న’ పథకానికి రూ.3 కోట్ల బకాయిలు

ఎన్నో వ్యయప్రయాసలతో నానా ఇబ్బందులు పడుతున్న మధ్యాహ్న భోజన వర్కర్లకు ప్రభుత్వం రూ.3 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ బిల్లులు నెలలు తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో కార్మికులు నిత్యం ఒకవైపు పోరాటాలు చేస్తూనే మరోవైపు వంటలు చేస్తూ జీవనం వెళ్లదీసుకుంటున్నారు. గత ఏప్రిల్ వరకు ప్రాథమిక పాఠశాలల నుంచి రూ.96,36,264, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి రూ.56,15,025, ఉన్నత పాఠశాలల నుంచి రూ.47,62,525 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితోపాటు మధ్యాహ్న భోజన వర్కర్లకు రూ.1.66 కోట్ల పారితోషికం బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. మరో ఐదు రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నందున ఈలోపైనా వీరి బకాయిలు చెల్లిస్తారో.. లేదో.. చూడాలి. ఇప్పటికే అప్పులు చేసి మరీ మధ్యాహ్న భోజనం అందిస్తున్న వంట ఏజెన్సీల బాధ్యులకు ఈ బకాయిలు గుదిబండలా ఉన్నాయి.

ప్రైవేటులో ఫీజుల నియంత్రణ లేనట్లేనా?

ఇక ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కూడా సరేసరిగా కన్పిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం మొక్కుబడి తనిఖీలు చేస్తుండడంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులను ఏటికేడు అదుపు లేకుండా పెంచుకుంటూ వెళ్తున్నాయి. నిబంధనల ప్రకారం పరిమిత సంఖ్యలో పేదలకు అందించాల్సిన ఉచిత విద్యను కూడా తుంగలో తొక్కేస్తున్నాయి. కేవలం ఫీజులకే పరిమితం కాకుండా ఏకంగా పాఠశాలల్లోనే దుకాణాలు పెట్టి పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర సామగ్రి వంటివన్నీ విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ తీరు చూస్తుంటే నియంత్రణ లేనట్లుగానే కన్పిస్తోంది.

పెండింగ్‌లో ‘భోజన’ బిల్లులు

మధ్యాహ్న భోజన పథకం బిల్లులు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అన్ని తరగతులకు సంబంధించి పాఠ్య, నోట్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కళాశాల స్థాయి వరకు యూనిఫాంలు కుట్టించాం. పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఒక జత దుస్తులు విద్యార్థులకు అందజేస్తాం. స్టిచ్చింగ్ పూరి కాగానే రెండో జత కూడా ఇస్తాం. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు పకడ్బందీ చర్య